
ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 07 జూలై 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
9. శ్రీపతిస్తుతి
8. వ్యాసోచ్ఛిష్ట మిదం సర్వం
11. భాగవతంలో భగవంతుని కథలు
13. జ్యోతిర్విజ్ఞానమ్
14. ఆచార్యుల ఔదార్యము
15. పుస్తక పరిచయం
16. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

గురుపూర్ణిమ అంటే వ్యాసపూర్ణిమే. అయితే కాలక్రమేణా ఇది అందరు గురువులకు అన్వయించుకుంటున్నాం. సంప్రదాయ పరిరక్షకులైన జగదాచార్యులు కూడా భగవత్ అంశతో జన్మించినవారే కనుక గురుపూర్ణిమ సందర్భంగా వారిని ఆరాధించడం ఆదరణీయం. వశిష్ట మహర్షి మునిమనుమడు, శక్తికి మనుమడు, పరాశర మహర్షికి కుమారుడు, శుక మహర్షికి తండ్రి అయిన కృష్ణద్వైపాయనుడు వేదరాశిని నాలుగు వేదములుగా విభజించడం వలన, అష్టాదశ పురాణములను రచించడం వలన వేదవ్యాసుడు అనే నామము వచ్చినది. 'వ్యాసస్తు భగవాన్ స్వయం' అన్నట్లు వేదవ్యాసునిది భగవత్ అవతారం. "అశ్వత్థామా బలిర్వ్యాసో హనుమాంశ్చ విభీషణః కృపః పరుశురామశ్చ సప్తైతే చిరంజీవినః అలా వారికి సప్త చిరంజీవులలో స్థానం పదిలమైంది. అద్భుతమైన వేద, సంస్కృత వాఙ్మయాన్ని అందించిన వేదవ్యాసుని ప్రతిరూపంగా మనకు వైదిక మార్గాన్ని సూచిస్తున్న, వైదిక గురుదేవులను ఆరాధిద్దాం, ఆచార్యుల బాటలో పయనిద్దాం. నిరంతరం ఆచార్యనిష్ఠతో మసలుకుందాం. గురుభక్తిని ప్రదర్శిద్దాం. గురుపూర్ణిమ సందర్భంగా శ్రీసన్నిధానం స్మరించుకుంటుంది.


PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## సామాజిక ఆరోగ్యానికి, మానసిక వికాసానికి యోగ



భారతదేశం యోగ భూమి, యోగసాధనకు పుట్టినిల్లు. అర్ధవంతమైన జీవనానికి, సామాజిక ఆరోగ్యానికి, మానసిక వికాసానికి యోగ సాధన ఎంతైనా అవసరం. అన్ని సంగతులు భారతీయ సనాతన సంస్కృతీ సంప్రదాయాల చుట్టే ఉన్నాయి. ఇటు ఆరోగ్యం, అటు మానసిక వికాసం, ఆధ్యాత్మిక చింతన ఏది కావాలన్నా క్షణాల్లో మనముందు దర్శనం ఇచ్చేలా ఋషులు మానవ జీవన విధానాన్ని ఒక క్రమపద్ధతిలో నడుచుకునేలా సులువైన మార్గాలను మనముందు ఆవిష్కరించారు. ప్రతి ఉదయం ప్రారంభంతోనే దైనందిన కార్యక్రమాలతో మమేకమైన వేళ ఆరోగ్య పరిరక్షణా బాధ్యతను గురించి వివరించారు పెద్దలు. గత జూన్ 21న మనం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నాం. సుమారు ఆరు సంవత్సరాలుగా ఈరోజుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. మన సంస్కృతి సంప్రదాయాలలో మంచిని పంచే అంశం ఉన్నప్పుడు ఇది ఒక మతంతో ముడిపెట్టకుండా చైతన్యవంతులమవుదాం. రేపటితరానికి ఆరోగ్య వెలుగులను అందిద్దామన్న ఆశ-ఆశయంతో ముందుకు వెళుతున్నాము. యోగ అంతర్జాతీయ వేదికమీద కనిపించే సరికి ఆలోచించాల్సిన విషయమే సుమా! అంటూ ప్రపంచ వ్యాప్తంగా దృష్టిపెడుతున్నారు. ద్వాపర యుగంలోనే యోగా ఆవిష్కరించారనడానికి ఆధారాలు ఉన్నాయి. శ్రీ పతంజలి మహర్షి ఆద్యుడు. పతంజలి పేర వచ్చిన యోగ గ్రంథాలు, యోగపీఠాలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. పతంజలి ఆదిశేషుని అవతారం. కాంతి సరోవరం వద్ద అంటే కేదారనాథ్ సమీపంలో ఆ యోగి ఆది గురువు మహాశివుడు, యోగ పరిజ్ఞానాన్ని సప్త ఋషులకు ప్రదానం చేసారని, వారు ఈ శాస్త్రాన్ని ప్రపంచం నలుమూలలకు తీసుకుని వెళ్ళారని భావిస్తున్నారు. సప్త ఋషులలో ఒకరైన అగస్త్య మహర్షి, దేశమంతా పర్యటించి జీవన విధానంలో దీనిని అనుసరించేలా చేశారని పురాణ ప్రవచనం. ఏది ఎలా ఉన్నా మనకు పతంజలి మహర్షి అందించిన సూత్రాలు, విధివిధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి ఆదరణీయం, ఆచరణీయం కూడా. ధార్మిక గురువులైన శ్రీ మహావీరుడి పంచ మహావ్రతాలు, గౌతమ బుద్ధుని అష్ట మార్గాలు కూడా ప్రాథమిక యోగ సాధనా మార్గాలే. ఈనాటికీ మానవ-వివేకానికి, వ్యక్తి వికాసానికి, మానసిక శాంతికి, అత్యంత ప్రామాణికమైనవిగా భావించబడే మూడు సూత్రాలు - జ్ఞాన, భక్తి, కర్మ యోగాలుగా శ్రీ భగవద్గీతలో అద్భుతంగా వివరించబడింది. పతంజలి మహర్షి తమ యోగ సూత్రాలలో అష్టాంగయోగ మార్గాలు వివరించారు. యోగ సాధన ద్వారా బుద్ధి, శరీరాలను నియంత్రించి శాంతిని పొందవచ్చన్న భావనను శ్రీ వ్యాసమహర్షి పలు సందర్భాలలో స్పష్టం చేశారు. ఉపాసన, యోగ, ధ్యాన సాధన సనాతన ఆచారాలలో భాగం. సూర్యుడు ప్రత్యక్ష దైవం. సూర్యనారాయణునిగా ఆరాధిస్తాం. ఈ క్రమంలోనే సూర్య నమస్కారాలు ఆవిష్కరించబడ్డాయి. సాధారంగా కొన్ని హోమక్రతువులలో కూడా సూర్య నమస్కారాలు చేయడం ఆనవాయితీ. యోగాలో అంతర్భాగంగా ఉన్న ప్రాణాయామం రోజువారీ పూజా విధానంలో భాగం. వేద, ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత ఇతిహాసాలలో యోగ సాధన ప్రస్తావనఉంది.

త్రిమతాచార్యులు తమ బోధనల ద్వారా యోగశాస్త్రం మరింత ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇక ఆధునిక కాలంవచ్చేసరికి శ్రీ రమణ మహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీవివేకానంద మొదలైనవారు రాజయోగ మార్గాన్ని అభివృద్ధి చేసారు. వేదాంత, భక్తి, హఠయోగ మార్గాలు కూడ క్రమంగా వర్ధిల్లాయి. ప్రస్తుత కాలంలో యోగసాధన వల్ల మానసిక శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అని నమ్మకం కుదిరింది. యోగసాధన ప్రపంచమంతా వ్యాప్తి చెందింది. సనాతన సంప్రదాయాలను యోగానుష్ఠాన విధానాలను ఆచరిద్దాం. రేపటి తరానికి ఆరోగ్యం జీవన విధానం అందిద్దాం.

-వొడ్లపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**ఆషాఢ మాసం 19-06-2023 శుక్ల పక్షంతో ప్రారంభమై 17-07-2023 వరకు. తదుపరి అధిక శ్రావణం.**

05-07-2023 వరకు ఆర్ద్ర కార్తి, 06-07-2023 నుండి 19-07-2023 పునర్వసు కార్తి, 20-07-2023 నుండి పుష్యమి కార్తి. **పండుగలు :** 03-07-2023 వ్యాస (గురు) పౌర్ణమి, 06-07-23 సంకష్టచతుర్ధి, 09-07-23 సికింద్రాబాదు శ్రీఉజ్జయిని మహంకాళీ జాతర, 13-07-23 కామికైకాదశి, సర్వేషాం ఏకాదశి, 16-07-23 హైదరాబాదు మహంకాళీ జాతర, మాస శివరాత్రి, 17-07-23 చుక్కల అమావాస్య, కర్కాటక సంక్రమణం. దక్షిణాయణ పుణ్యకాల ప్రారంభం. 22-07-23 ఆండాళ్ తిరునక్షత్రం, 29-07-23 సర్వేషాం ఏకాదశి.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల లాభదాయకంగానే ఉండును. వృత్తి వ్యాపారాలు కలిసివచ్చును. ఆదాయంనకు లోటుండదు. సంతోషంగా ఉంటారు. ఇనుప వ్యాపారాలు కలిసి వచ్చును.



**వృషభం:** ఈనెల గ్రహసంచారం అనుకూలంగా ఉన్నందున వృత్తివ్యాపారములందు అనుకూలత, విజయం లభించును. గృహనిర్మాణాలు కలిసివచ్చును. కుటుంబ వృద్ధి,



**మిథునం:** ఈ నెలయందు అనుకూలంగా ఉంది. చేయు వృత్తి వ్యాపారాలందు రాణింపు ఉంటుంది. ప్రభుత్వ సంబంధ వ్యవహారాలందు అనుకూలం. బంధుమిత్ర సంతోషాలు సంతాన సౌఖ్యం.



**కర్కాటకం:** ఈ నెల కొంత ఫర్వాలేదు. ఆదాయంనకు లోటుండదు. సంతాన సౌఖ్యం భార్యాభర్తల మధ్య సరైన అవగాహన ఉంటుంది.



**సింహం:** ఈనెల జన్మరాశిలో గ్రహసంచారం అయినప్పటికీ యోగ దాయకంగానే ఉంటుంది. అన్నిరంగాలవారికి బాగుంటుంది. ప్రయాణాలు కలిసి వచ్చును. ఆర్థికంగా బాగుండును. కోపం అధికం.



**కన్య:** ఈనెలలో బాధలు తప్పవు. వృత్తివ్యాపారాలు అంతగా బాగుండవు. ఆదాయం అంతంత మాత్రమే. ఊహించని ఖర్చులు. ఋణాలు చేయవలసివచ్చును.



**తుల :** ఈనెల అన్నివిధాలుగా బాగుంటుంది. విద్యార్థులకు బాగుంటుంది. బాకీలు వసూలగును. పనులు సంతృప్తికరంగా పూర్తగును. బంధుమిత్ర లాభాలు, కుటుంబంలో సంతోష వార్తలు



**వృశ్చికం:** ఈమాసం అనుకూలం. చేయువృత్తి వ్యాపారాలు అన్నిరంగాల వారికి బాగుండును. కుటుంబంలో సంతోష వాతావరణం ఉంటుంది.



**ధనుస్సు:** ఈనెలయందు మిశ్రమ ఫలితాలు. వ్యాపారాలు లాభాలు తగ్గును. ఖర్చులు అధికంగా ఉండును. మనోనిబ్బరం కోల్పోవుదురు. సంతానం వలన సౌఖ్యం, స్త్రీ సౌఖ్యం, కుటుంబ సౌఖ్యం.



**మకరం:** ఈనెలయందు వ్యాపార, వ్యవహారాలు అనుకూలంగా ఉన్ననూ, శారీరక శ్రమ అధికం, మానసిక ఆందోళనలు, బద్దకం ఎక్కువగా ఉండును.



**కుంభం:** ఈనెలయందు వృత్తివ్యాపారాలందు రాణింపు,ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు.



**మీనం:** ఈనెలయందు జీవనం ప్రశాంతంగా గడుచును. ధనమునకు లోటుండదు. మిత్రులు సహాయ సహకారములు అందించెదరు. శత్రుజయం, నూతన పరిచయ లాభములు, కుటుంబ సౌఖ్యం

సంకల్పము నందు తిథి ఏ విధంగా చెప్పాలి.
సూర్యోదయమునకు ఏ తిథియున్నా ఆరోజంతయు సంకల్పమునకు ఆ తిథియే చెప్పవలెను. సూర్యోదయానంతరం వ్యాప్తి కొద్దిగా ఉన్ననూ గొప్పగా ఉన్ననూ ఆ వ్యాప్తితో నిమిత్తములేదు. సూర్యోదయమునకు ఒక తిథియుండి, మరుసటి సూర్యోదయము లోపల మరొక తిథి గడిచినచో మొదటి తిథి ఉపరి రెండవ తిథి అని చెప్పవలెను.

## మంచి రోజులివిగో...

నిజ శ్రావణ మాసం వరకు వివాహ, గృహ ప్రవేశ, ఆరంభములు, ప్రతిష్ఠా శుభ ముహూర్తములు లేవు.

# మన దేవాలయాలు

# గోవింద వనమాలా క్షేత్రం





**సేకరణ: సేనాపతి సంపత్కుమారాచార్యులు**

నిజామాబాద్ నగరానికి అతి సమీపంలోని నర్సింగ్ పల్లి గ్రామములో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీమాన్ నరసింహ రెడ్డి గారి ఆధ్వర్యములో నిర్వహింప బడుతున్నది. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసన పూర్వక మార్గ దర్శకత్వంలో, గ్రామస్తులే స్వచ్ఛందంగా ఆలయ నిర్మాణానికి కరసేవ కైంకర్యం చేశారు. 2009 లో ప్రారంభమైన ఈ ఆలయము 2014 లో చినజీయర్ స్వామి వారి కరకమలములచే ప్రతిష్ఠించబడింది. స్వామి పరివారముగా తిరుమలకొండ మీద ఉన్నట్లే ఇక్కడ కూడా స్వామిపుష్కరణీ తీరాన శ్రీ ఆదివరాహస్వామి, ఆగ్నేయ భాగములో వరదరాజస్వామి వకుళామాత ఆలయాలు, శ్రీస్వామివారి ప్రసాదాలు సిద్ధముచేసే శ్రీవారిపోటు ఉన్నాయి. ఆలయానికి దక్షిణ ప్రదక్షిణమార్గములో స్వామి కళ్యాణమండపము, వాయువ్యములో వాహనమండపము, ఉత్తరాన విశ్వక్సేనసన్నిధి, శ్రీభాష్యకార్ల సన్నిధి మరియు ఈశాన్య భాగములో శ్రీ యోగనరసింహ స్వామి సన్నిధులు ఉన్నాయి. ఆలయం వెలుపల ఆంజనేయస్వామిసన్నిధి. విశేషకార్యక్రమాలు నిర్వహించడానికి ఆస్థానమండపము నిర్మించబడ్డాయి. ఈ ఆలయంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహింప బడుతాయి. ప్రతిరోజు స్వామివారికి నైవేద్యముగా ప్రాకృతిక వ్యవసాయముద్వారా పండించిన ధాన్యాలతో, దేశీ ఆవుల నేతితో, గానుగ ద్వార తీసిన నూనె తో చేసిన ప్రసాదాలు సమర్పిస్తారు. ప్రతి పున్నమనాడు గర్భిణిలకు దివ్యౌషధము ఇచ్చే కార్యక్రమము. పిల్లలకు ప్రతి నెలా పుష్యమీ నక్షత్రము నాడు బాలామృతమనే ఔషధము, సంతానార్థులకు మాఘపూర్ణిమ నాడు దివ్యౌషధము, ఆస్తమా రోగులకు కార్తీక పూర్ణిమనాడు ఔషధములను ఉచితంగా అందిస్తారు.



ఉత్సవాల్లో అన్నమయ్య కీర్తనలతో పాటు హనుమద్దాసు కీర్తనలు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమాన్ నరసింహరెడ్డి గారు స్వయముగా రాసినపాటలు స్వామివారికి కైంకర్యముగా పాడి వినిపిస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భోగి పండుగనాడు ఉదయము గోదాకల్యాణము తరువాత సాయంత్రము స్వామివారి ప్రత్యక్షములో సామూహిక భోగి మంటల కార్యక్రమము నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరము ఫాల్గుణ మాసములో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహిస్తారు.

ఈ ఉత్సవాలలో జీయర్ స్వాములు, కవులు, గాయకులు, ముఖ్యమంత్రి స్థాయి వరకు నేతలు, ప్రభుత్వ అధికారులు, సామాజిక కార్యకర్తలు, ప్రాకృతిక ఆద్యాత్మిక వ్యవసాయకర్తలు, సినీ ప్రముఖులు పాల్గొంటారు. స్వామి అభిషేక సేవలో పాల్గొని ఆలయములో ఇచ్చిన కంకణం తీసుకొని స్వామి వారికి మనస్సులోని కోరిక విన్నవించి ఆలయ ప్రాంగణములోగల స్వామివారి దేవతావృక్షానికి కట్టడము, కోరిక తీరిన తరువాత మళ్ళీ స్వామి సోమవార అభిషేక సేవలో పాల్గొని ఆ కట్టిన కంకణాన్ని విప్పడము ఇక్కడి ప్రత్యేకత. తిరుమలలో రద్దీ మధ్య స్వామి దర్శనము సరిగ్గా చేసుకోలేదనే భక్తుల మనోవేదన తీర్చడానికే స్వామి ఇక్కడకు విచ్చేసినాడా అనే భావము కలుగుతుంది. ఈ క్షేత్రాన్ని దర్శించాలంటే నిజామాబాద్ హైదరాబాద్ రోడ్డులో బోర్గాము అనే ప్రాంతము నుండి బస్సు ఆటో సౌకర్యముతో వెళ్ళవచ్చును.

అర్చకులు రోహిత్ ఆచార్య, ఉప అర్చకులు విజయ్ కుమార్ ఆచార్య, విష్ణు ఆచార్య మొదలగువారు. సోమవారం అభిషేకసేవ పున్నమి సేవ, శ్రావణ మాసంలో కుంకుమ అర్చనలు మాస కళ్యాణం సేనాపతి సంపత్కుమారాచార్యులు, బ్రహ్మోత్సవాలు పవిత్రోత్సవాలు జ్యేష్ఠాభిషేకం శ్రీమాన్ లక్ష్మణా చార్య స్వామి మొదలగువారు నిర్వహిస్తారు.

# సామర్థ్యం నామ సార్థక్యం

**- శ్రీమతి సముద్రాల శారద**

భారతీయ సంస్కృతిలో నామ సంబోధనలో ఒక ప్రత్యేకత ఉంటుంది. నామ మాధురీ మహత్యాలను గురించి ఎన్నో విశేషాలు ఉన్నాయి. నామము అనగా స్వరూప స్వభావ గుణశీలాల భావాంతర్యంగా అక్షరరూపంలో కనిపించే ఒక శబ్దము. అది ఒక వ్యక్తి చేసే కార్యాలను తెలుపుటే కాక పరస్పర సంబంధ బాంధవ్యాలను కూడా తెలియజేస్తుంది.

షోడశ సంస్కారాలలో నామకరణ సంస్కారము ప్రథమము ప్రధానము. గొప్ప వారిని గౌరవిస్తూ ఇచ్చే బిరుదులు వారి సేవలను ప్రతిబింబిస్తాయి. అధికార పదవి నామాలు వారి కర్తవ్యాన్ని బాధ్యతను గుర్తు చేస్తాయి. భగవన్నామం అలౌకిక ఆనందాన్ని ప్రయోజనాన్ని కలిగిస్తుంది. "మంత్రా ధీనంతు దైవతం" అని వైదిక ధర్మాచరణల్లో అనుష్ఠానంలో భగవద్ నామాన్ని ఉద్దేశించిన మంత్రాలు భగవత్ శక్తినే ఉద్దీప్తం చేస్తాయి. ఆ నామ మంత్రాల కూర్పుతో చేసే ఆరాధనలు హోమాదులు ఫలిస్తాయని విశ్వాసం.



నామ స్మరణం, నామ గుణానుభవం మోక్షదాయకం అని కూడా విశ్వాసం. పరంపరగా తాత తండ్రుల నామధేయాలను కూడా శుభప్రదంగా భావించి స్వీకరిస్తారు. పార్వతి అనగా పర్వతస్య అపత్యం స్త్రీ అని, సుమిత్రాయాః అపత్యం పుమాన్ సౌమిత్రి అని నామ శబ్ద వ్యుత్పత్తి వివరిస్తారు. జన్మ నక్షత్ర పూర్వక నామాహ్వాయం చేస్తారు. సంప్రదాయంలో పంచ సంస్కారాలు చక్రాంకిత ఉపదేశములు స్వీకరించేటప్పుడు నామ సంస్కారంగా ఆచార్య దాస నామాన్ని స్వీకరిస్తారు. మహనీయుల బిరుదులు స్తోత్రాలు వారి కృషిని లోకోపకార కృతిని తెలియజేస్తాయి.

సంక్షిప్తాక్షర రూపమైన నామంలో విశిష్టమైన విస్తార చరిత్ర వైభవమే తెలుస్తుంది. గుణానుభవం కలుగుతుంది. అటువంటి సామర్థ్యం కలిగి, సార్థక్యం కలిగిన భగవద్రామానుజాచార్యుల నామ సార్థక్య సన్నివేశాలను తెలుసుకుంటే వారి స్వభావ ఔన్నత్యము చరిత్ర వైభవము కూడా తెలుస్తాయి.



జగదాచార్యుల దివ్య నామములు

ఇళైయాళ్వార్–తిరుమల నంబి
రామానుజులు –పెరియనంబి
యతిరాజులు – శ్రీకంచి వరదరాజ పెరుమాళ్
ఉడయ వర్ – శ్రీరంగనాథ పెరుమాళ్
లక్ష్మణమునులు –తిరువరంగ పెరుమాళరయర్
ఎంబెరుమానార్ – తిరికోష్ఠియూర్ నంబి
కోయిల్ అణ్ణన్ – గోదాదేవి
తిరుప్పావై జీయర్ – పెరియ నంబి
భాష్యకారర్ – శారదాదేవి
భూత పురీషులు–ఆదికేశవ పెరుమాళ్
దేశికేంద్రులు – తిరుమల శ్రీనివాస పెరుమాళ్

తిరువల్లిక్కేణి దివ్యదేశము నందు కొలువైన పార్థసారథి స్వామి అనుగ్రహంతో శ్రీపెరుంబుదూరు నందు కాంతిమతి కేశవసూరి దంపతులకు జగదాచార్యులు జన్మించారు. ఆనాటి ఆచారము ననుసరించి 12 రోజుల శిశువునకు మేనమామ శ్రీశైల పూర్ణులు (తిరుమల నంబి) శంఖ చక్ర పూ ముద్రలు వేసి "ఇళై ఆళ్వార్"అని నామకరణం చేశారు. చిన్ననాడే బాల సూర్యుని వలె ప్రకాశించే భవిష్యదాచార్యులు తల్లికి ఆదిశేషుల వలె తండ్రికి పంచాయుధముల వలె కనిపించారట! అందుకే పెద్దలు "ఆదిశేషులా, సేనానాథులా (విశ్వక్సేనులు), శ్రీపతియా" అని ప్రాజ్ఞులు వితర్కించారు అని కీర్తిస్తారు.

రామ అనుజులు అనగా బలరామ అనుజులు శ్రీకృష్ణ భగవానుడు. జగద్గురువై తత్వహిత పురుషార్థములను బోధించిన శ్రీకృష్ణుని వలె జగదాచార్యులను కూడా ఆచార్యులుగా భావిస్తారు. శ్రీరామచంద్రుని అనుసరించిన లక్ష్మణుని వలె భగవత్ తత్వాన్ని లోకానికి అందించిన వీరిని లక్ష్మణ మునులు అని సంభావించారు. ప్రత్యక్ష ఆచార్యులు కాకపోయినా యామున మునులు పరంపరగా లభించిన ఆచార్య అర్చామూర్తిని రామానుజాచార్యులుగా భావించి వారికి ఉపదేశ గురువులుగా పంచాచార్యులను ఏర్పాటు చేశారు. వారిలో మహా పూర్ణులు (పెరియనంబి) వద్ద ఉపదేశం (మిగతా 12 వ పేజీలో)

# సారస్వత ఆరాధనోత్సవ సమ్మానగ్రహీతలు

## శ్రీ ఉ.వే. శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

వైదిక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ప్రధాన భూమికను పోషిస్తారు. జ్యోతిష్య, వాస్తు, దేవాలయ ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవాది ఏ విషయంలో నైనా శాస్త్రబద్ధంగా సమన్వయించగలిగిన సమర్థులు శ్రీమాన్ శ్రీ నంబివేణుగోపాలచార్య కౌశిక గారు. వీరు జగిత్యాల వాసులై బాల్యం నుండే గొప్ప శాస్త్ర పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. కోటి కుంకుమార్చన పేరుతో ప్రముఖ పీఠాధిపతులను ఆహ్వానించి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నిర్వహించారు. స్వయంగా జగిత్యాల నడిబొడ్డున గల పారంపర్యంగా నిర్వహించే శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని గొప్పగా అభివృద్ధి చేశారు. వేదిక పైన ఉండి వారు ప్రవచించే మధురమైన శ్రీ సూక్తులకై ఎందరో భక్తులు ఆసక్తితో ఎదురుచూస్తారు. 900 వందలకు పైగా దేవతా ప్రతిష్ఠలు చేశారు. భక్తి పూర్ణమగు భాగవత కథలను మధురంగా ప్రవచిస్తారు. వివిధ ప్రాంతాలలో భాగవత సప్తాహ కాలక్షేపాలు నిర్వహించారు. నేటికి 50 పైగా భాగవత సప్తాహాలు పూర్తి చేశారు. జ్యోతిష్య వాస్తు సలహాలతో ప్రాంతీయ ప్రజల అభిమానాన్ని గౌరవాన్ని చూరగొన్నారు. నాడు శ్రీసన్నిధానం పత్రిక స్థాపన లోను నేటి పత్రిక నిర్వహణ లోను గౌరవ సంపాదకులుగా సహకరిస్తున్నారు.

## శ్రీ ఉ.వే. శ్రీమాన్ అమరవాది వెంకట నరసింహాచార్యులు

సాంప్రదాయ రహస్య గ్రంథ పరిజ్ఞానం, తెలుగు సంస్కృత ద్రావిడ భాషలలో పాండితీ ప్రకర్ష గల ప్రపన్నాగ్రేసరులు శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకట నరసింహాచార్యులు. అనేక సాంప్రదాయ రహస్య గ్రంథాలను సులభ గ్రాహ్యముగా బోధించడం, అంతర్జాలం ద్వారా ప్రవచనాలు చేయడం, సాంప్రదాయ నిరతులను ప్రోత్సహించడం వారి ప్రవృత్తి. అధ్యాపకులుగా సుదీర్ఘకాలం ప్రభుత్వ సర్వీసులో విధులు నిర్వర్తించారు. సదా క్రియాశీలులైన వీరు జిజ్ఞాసులకు విజ్ఞానఖని. సారస్వత వాచస్పతులై వారు చేసే సంప్రదాయ సేవ ఎనలేనిది. ఉభయ వేదాంత రత్నాకర వాఙ్మయ సుధా నిధి, గోపాల దేశిక మొదలగు గౌరవ సత్కారాలను ఎన్నింటినో స్వీకరించారు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీమాన్ శ్రీ తే. కం గోపాలాచార్య స్వామి వారి ఆధ్వర్యంలో జరిగిన ఉభయ వేదాంత సభల్లో సమన్వయించారు. దివ్య ప్రబంధాలు, సంప్రదాయ రహస్య గ్రంథాలు, శ్రీరామాయణం, ఉపనిషత్తులు, శ్రీభాష్యం, వివిధ స్తోత్ర పాఠాలు మొదలగు సంస్కృత ద్రావిడ పూర్వా చార్య గ్రంథాలలోని ఏ అంశాల పైన అయినను సమగ్రంగా మధురంగా ప్రవచించగల ప్రావీణ్యులు. కరీంనగర్ జిల్లా వాసులై హైదరాబాదులో స్థిర నివాసులై ఉన్నారు. శ్రీసన్నిధానం పత్రికకు నాడు నేడు కూడా గౌరవ సంపాదకులై సహకరిస్తున్నారు.

## శ్రీ ఉ.వే. శ్రీమాన్ శిరిశినహళ్ వెంకటాచార్యులు

శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామివారి కాలం నుండి ఉభయ వేదాంత పండిత సభల్లో గంభీర సమగ్ర సంప్రదాయ విషయోపన్యాసకులు, గొప్ప వక్త శ్రీమాన్ శ్రీ శిరిశినహళ్ వెంకటాచార్య స్వామి. (మిగతా 10 వ పేజీలో)



# వ్యాసోచ్ఛిష్ట మిదం సర్వం


**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**


సనాతన వైదిక ధర్మంలో గురు పూర్ణిమకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆషాఢ పూర్ణిమకే “గురు పూర్ణిమ” అని పేరు. దీనిని వ్యాసభగవానుని జయంతిగా భావిస్తారు.

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అని మన తెలుగు నాట పిలవడం ప్రముఖంగా కనిపిస్తుంది. దానికి కారణం ఈనాటి నుండి పండుగలు ప్రారంభమవుతాయని “తొలి ఏకాదశి” అంటారట. అలాగే ఏకాదశి “శయనైకాదశి” అని పేరు కూడా ఉంది. శ్రీ విష్ణుమూర్తి ఈ ఏకాదశి నాడు క్షీర సముద్రంలో శయనానికి ఉపక్రమిస్తాడు.



ఈనాటి నుండి నాలుగు నెలల కాలం అనగా కార్తీక శుద్ధ ఏకాదశి వరకు స్వామి నిద్రిస్తాడట, కనుక ఈ ఏకాదశి ని ఉత్థాన ఏకాదశి అని పేరు. అనగా నిద్రించిన స్వామి, నిద్ర లేచిన రోజు. ఈ నాలుగు నెలలకు “చాతుర్మాస్యం” అని పేరు.

ప్రధానంగా యతులు సంప్రదాయ బద్ధంగా ఈ చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించడం నేడు లోకంలో అన్ని సాంప్రదాయాలలోనూ కనిపిస్తుంది. ఈ వ్రతాన్ని వైదిక సాంప్రదాయమునకు చెందిన ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత యతులు ఈ “గురు పూర్ణిమ” నాడే ప్రారంభిస్తారు. దీనిని నాలుగు నెలలు గాని, లేక నాలుగు పక్షాలుగాని ఆచరించడం సంప్రదాయంగా కనిపిస్తోంది. వ్రతారంభాన్ని చేసేటప్పుడు శ్రీకృష్ణ పరమాత్మను, శ్రీవేదవ్యాస మహర్షిని, భాష్యకారులు అయిన ఆచార్యులను పూజించి ప్రారంభిస్తారు.

సనాతనమైన వైదిక వాఙ్మయమంతా శ్రీవేదవ్యాస మహర్షి వల్లనే లోకానికి అందింది. అందుకే ఈయనను సాక్షాత్తు భగవంతుని అవతారం గానే పురాణాలు ‘వ్యాసో నారాయణః స్వయమ్’ అంటూ పేర్కొంటున్నాయి. భగవంతుడే గురువుగా అవతరించి జ్ఞాన బోధ చేస్తాడు అని శాస్త్ర వచనం.

అఖండమైన, అనంతమైన, అపౌరుషేయమైన వైదిక వాఙ్మయం నేడు అనేక శాఖలుగా ఋగ్యజుస్సామాధర్వలనే పేర్లతో పిలువబడటానికి ప్రధాన కారణం వ్యాసమహర్షియే. తన శిష్యులైన ‘పైల, వైశంపాయన, జైమిని, సుమంతు’ లనే మహర్షులకు ఋగ్వేదాన్ని, యజుర్వేదాన్ని, సామవేదాన్ని, అధర్వ వేదాన్ని క్రమంగా ఉపదేశించి లోకంలో వేదమును ప్రవర్తింప చేయడమే గాక పంచమ వేదముగా ప్రసిద్ధి పొందిన శ్రీ మహాభారతం ఇతిహాసాన్ని వేదోపబృంహణంగా అనగా వేద సారంగా లోకానికి అందించిన మహోపకారకుడు వేదవ్యాసుడు. అలాగే పదునెనిమిది మహా పురాణాలను, ఉప పురాణాలను రచించి, ఉపనిషత్తుల తాత్పర్యాన్ని బ్రహ్మసూత్రములుగా లోకానికి ఉపదేశించాడు. నేడీ అనంతమైన వాఙ్మయం లేక పోతే సనాతన సంప్రదాయమే లేదు. అందుకే “వ్యాసోచ్ఛిష్ట మిదం సర్వం” అంటారు పెద్దలు. ఈ కారణం వల్లనే ఆషాఢ మాస పూర్ణిమ నాడు వ్యాసభగవానుని పూజిస్తూ వైదిక ధర్మానికి చెందిన యతులు చాతుర్మాస్య వ్రత దీక్షను ప్రారంభిస్తారు.


అద్వైత సాంప్రదాయమును ప్రవర్తింప చేసిన జగద్గురు ఆది శంకరాచార్యులైనా, విశిష్టాద్వైత సాంప్రదాయమును ప్రవర్తింప చేసిన భగవద్ రామానుజాచార్యులైనా, ద్వైత సాంప్రదాయమును ప్రవర్తింప చేసిన మధ్వాచార్యులైనా శ్రీవేదవ్యాస మహర్షి ప్రణీతమైన బ్రహ్మసూత్రములను ఆధారంగా చేసుకునే వారి వారి మతములను ప్రచారం చేసుకున్నారు. అందుకే ఈ “గురు పూర్ణిమ” అందరికీ ఉపాధేయమైనదే.

కేవలం ఈ మత త్రయాచార్యులే కాక వీరి తర్వాత వారైనా నింబార్క, చైతన్య, వల్లభ, రాధామాధవాది సంప్రదాయ ఆచార్యులందరూ ఈ “గురు పూర్ణిమ” ను అత్యంత భక్తితో జరుపుకుంటారు.

ఈ ఆషాఢ పూర్ణిమ (గురుపూర్ణిమ) నాడు భగవద్గీతను ఉపదేశించిన జగద్గురువైన గీతాచార్యులు శ్రీకృష్ణుని, సమస్త వైదిక వాఙ్మయాన్ని లోకానికందించిన శ్రీవ్యాస మహర్షిని అలాగే ఆయా సాంప్రదాయ ప్రవర్తకులైన గురువులను పూజించడం సాంప్రదాయం. ★

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట



ప్రాతర్నిత్యాను సంధానంలో
## 'కృష్ణాష్టకం'

దశరథ మహారాజు స్వర్గంలోనే చేరిపోయినాడు. కానీ దేవకీ వసు దేవులు భగవంతుని సన్నిధానమైన మోక్షమును పొందినారు. రాముడుగా మనకు సకృదేవ ప్రపన్నాయ అని మిత్రభావేన సంప్రాప్తం అంటూ ఒకటిరెండు శ్లోకాల ద్వారా "శరణాగత రక్షణ" ప్రధానం అని భోదించినాడు. కృష్ణావతారంలో అందరికి సులభంగా అర్థమైయ్యే సరళ సంస్కృత భాషలో ఉచ్చరించుటకు కష్టం కాని 'అనుష్టుప్' వృత్తాన్ని ఎంచుకొని 18 అధ్యాయాలుగా 'గీత' ను అందించాడు. అందులో ఎక్కడ కూడా 'కృష్ణ ఉవాచ' అని వుండక 'శ్రీభగవానువాచ' అనే ఉంటుంది. భారతీయ సంస్కృతిలో న్యాయ స్థానాలలో కూడా భగవద్గీతనే ప్రమాణ గ్రంథంగా చెప్పుతుంటారు. అందులో చివరగా 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని జగద్గురువై బోధించాడు. ఆ శ్లోకం వివరణ మనం తిరుమంత్రార్థంలో వినగలం ముందు ముందు. 'దేవం' అది 'దివ్ - క్రీడాయం' అనే ధాతువుగా ఏర్పడిన విషయంగా లీలావిభూతి, నిత్యవిభూతి. ఈ రెంటితో క్రీడించేవాడు అని అర్థం చెప్పుకున్నాము. ఇక దేవకీదేవికి పరమానందాన్ని ఇచ్చినాడు. 'తన కొడుకు మల్లులతో పోరు సల్పుతున్నప్పుడు, స్త్రీల సమూహంలో చేరియున్న దేవకీదేవి 'ఏమి కష్టం కలుగుతుందో'! అని శంకించుచున్న కన్నతల్లి దుఃఖానికి కారణమైన కంసుని, చాణూరుని చంపడంతో ఆనందంలో ముంచిన వాడు. అట్టి జగద్గురువునకు నమస్కారము అని శ్లోక తాత్పర్యము.

**2. శ్లో॥ అతసీ పుష్ప సంకాశం హారనూపుర శోభితమ్।**
**రత్నకంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుమ్.॥**

ప్రతిపదార్థం: అతసీ పుష్ప సంకాశం = నల్ల అవిశ పువ్వు రంగువంటి నిగనిగలాడు రంగు గలిగిన, హారనూపుర శోభితమ్ = హారములతో నూపురములతో ప్రకాశించుచున్న, రత్నకంకణ కేయూరం = రత్నములు పొదిగిన కంకణములు, భుజకీర్తులు గలిగిన, జగద్గురుమ్ = లోకాచార్యుడైన, కృష్ణం = కృష్ణుని గురించి, వందే = నమస్కరించుచున్నాను.

తాత్పర్యం: ఈ శ్లోకంలో శరీర కాంతి, ఆభరణములతో కూడిన కృష్ణుని వర్ణన వుంది. ఆయన శరీర కాంతి నల్ల అవిశె పువ్వు.

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

దానినే కాటుక పువ్వు అని గూడా అంటారు. అది నల్లగా నిగ నిగ మెరుస్తూ ఉంటుంది. అట్లే ఈయన శరీరం మెరుస్తున్నది. కంఠంలో రత్నములు పొదిగిన బంగారు హారములు, కాళ్ళకు నవరత్న ఖచితమైన అందెలు, కాళ్ళ గజ్జెలు అనికూడా అంటాము. ముంజేతులకు రత్నమయమైన కంకణాలు, భుజములందు దండ కడియములు కలిగి అందంగా విరాజిల్లుచు ఉంటాడు శ్రీకృష్ణుడు. లోకానికంతటికి ఆచార్యుడాయన. ఆయనకు నమస్కరించు చున్నాను అని భావము.

ఆభరణాలు పురుషులు ధరిస్తారా? స్త్రీలు ధరిస్తారా? అనే ప్రశ్న అవసరం లేదు. అందరు ధరించవచ్చు. అసలు ఆభరణాలు ఎందుకు ధరించాలి? ఏ యే ప్రదేశములందు వేటిని ధరించాలి? అని గూడా వుంది. బంగారము, వెండి. వజ్రాలు, రత్నాలు మన శరీరంలో ఏయే భాగాలలో వుండాలి అని గూడా వుంది. ఇప్పుడు మనం చూస్తున్నాము గదా! ఆక్యుపంక్చర్ అని అంటే ఏ భాగంలో ఒత్తిడి చేస్తే ఏం ఫలితం అనివుంది. శరీరంలో మెడ, కాళ్లు, కాళ్ళ వేళ్లు, చేతులు, చేతుల వేళ్లు ముఖ్యము. అందులో నొసలు, చెవులు, ముక్కు, బట్టలతో కప్పబడకుండా వుండే భాగాలు. ఆ భాగాలలో గనక బంగారం, వెండి, రాగి, రత్నములు తాకుతూ వుంటే రోగ నిరోధక శక్తి గలుగుతుంది. అంతే గాక అందంగా కూడా వుంటుంది. కాబట్టే పూర్వం నుంచి పురుషులు స్త్రీలు, పిల్లలు వృద్ధులు అనే తేడా లేకుండా వారివారి శక్తికి తగిన ఆభరణాలు ధరించేవారు. చాలాకాలం ఆరోగ్యంగా వుండే వారు. స్త్రీలు నెత్తిపైన, పాపెటలో గూడా ఆభరణాలు పెట్టుకునేవారు. ఇప్పుడు ఈ ఆభరణాలన్ని ముఖ్యంగా కేసలం సినిమా, టి.వి. సీరియళ్ళలో తప్ప కనబడటం లేదు. కొందరు పురుషులలో చేతి వేళ్ళకు ఉంగరాలు, మణికట్టు మీద బ్రాస్ లెట్ అంటాము గదా బంగారు గొలుసు కంకణం వలె, మెడలో బంగారు హారములు, చెవికి పోగులు కనబడుతున్నవి. (మిగతా 15 వ పేజీలో)

# సారస్వత ఆరాధనోత్సవ సమ్మానగ్రహీతలు

(7 వ పేజి తరువాయి) తెలుగు రాష్ట్రంలోని ప్రముఖ కవులు, విశిష్టాద్వైత సిద్ధాంత విశ్లేషకులు, ప్రవర్తకులు, పంచసంస్కారోపదేశాలు చేసే ఆచార్యులు శ్రీమాన్ శ్రీ శిరిశినహళ్ శతావధాని కృష్ణమాచార్యుల వారి కుమారులైన శ్రీమాన్ శ్రీ వెంకటాచార్య స్వామి వారు మన తెలుగు రాష్ట్రంలో సుప్రసిద్ధులు. ఉన్నత విద్య తో పాటు సాంప్రదాయ గ్రంథాల అధ్యయనం గావించిన ఉభయ వేదాంత, పురాణ, శాస్త్ర జ్ఞాన పరిపూర్ణత గల పండితులు.

ఆచార్యపురుషులైన వీరు పాండితీ ప్రకర్షతో ఎందరో ప్రముఖుల చేత సత్కరింపబడ్డారు. రఘునాథదేశిక, గోపాలోపాయన మొదలగు ప్రసిద్ధ సత్కారములే కాక టీటీడీ వారి చేత, మరియు అనేక సభల్లో పండిత పురస్కారాలు పొందారు.

వేద వేదాంతములను తర్కమీమాంసాది శాస్త్రములను ద్రావిడ ప్రబంధములను మరెన్నింటినో అధ్యయనం చేశారు. ఉద్యమ స్ఫూర్తి తో సంప్రదాయ సేవాతత్పరులై ఉభయ వేదాంత ప్రవచన గోష్ఠికి మార్గ దర్శకులై క్రియాశీలంగ వ్యవహరిస్తున్నారు. ఉభయవేదాంత సభల్లో ప్రవచిస్తున్నారు. శ్రీసన్నిధానం పత్రికకు సహృదయంతో సహకారము అందిస్తున్నారు.

---

## శ్రీ ఉ.వే. శ్రీమాన్ కండ్లకుంట వెంకట నర్సింహాచార్యులు

ఉభయ వేదాంత ప్రవచన గోష్ఠిలో ప్రధాన భూమికను పోషిస్తూ సదా సాంప్రదాయ గ్రంథ రచనలో కృషి చేస్తూ ఆళ్వారాచార్యుల శ్రీసూక్తులను ప్రవచిస్తూ ఎందరినో ఆధ్యాత్మికోన్ముఖులను గావించినారు. భావస్ఫోరకమగు సహజ మాధుర్యంతో అలరించే వారి కాలక్షేపాలు వింటే ఆసక్తి పరులకు ఎంతో ఆనందం! ఉభయ వేదాంత గ్రంథాలు ద్రావిడ ప్రబంధ సంబంధ వ్యాఖ్యాన గ్రంథాల విశేషాలనూ. ఉపనిషత్ విషయలనూ అంతర్జాలంలోనూ వేదికల పైననూ అనర్గళంగా సమగ్రంగా ప్రవచించ గల ప్రసిద్ధులు. ప్రధానంగా సంవత్సర కాలం వారు కరీంనగర్‌లో శ్రీ భాష్య కాలక్షేపం అద్భుతంగా నిర్వహించారు. 30 కి పైగా సంప్రదాయ గ్రంథ రచన గావించారు. వృత్తిలో 40 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా అధ్యాపకులుగా సేవలందించారు. రఘునాథదేశిక పురస్కారం మరియు అనేక గౌరవ సత్కారాలు పొందారు. శ్రీసన్నిధానం పత్రిక పునః ప్రారంభోత్సవంలో పాల్గొని స్వయంగా వారి కరకమలములతో శుభారంభం చేసి ప్రోత్సహించారు. వారు చేసే సాంప్రదాయ సేవ ఎనలేనిది.

---

## కుల ధనం కథనం

సాంప్రదాయంలో "కుల ధనం అనే మాటకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రతి ఇంటిలో గృహ పెరుమాళ్ళ ఆరాధనము. తప్పక జరుగవలసి ఉన్నది. పరంపరగా పూజించే గృహ పెరుమాళ్ళ మూర్తిని, ఆరాధన దైవాన్ని కులధనంగా చెప్తారు. కుల ధనం గురించి పెద్దల శ్రీ సూక్తుల నుండి చిన్న కథనం ! పరమపద నాథుని నాభికమలం నుండి బ్రహ్మ దేవుని సృష్టించిన తర్వాత చతుర్వేదాలు ఉపదేశించి, కర్తవ్యాన్ని బోధించాడు. అనంతరం బ్రహ్మదేవుని కోరికపై శ్రీమన్నారాయణుడు బ్రహ్మ ఆరాధించు కొనుటకు శేషతల్పశాయి రూపంలోగల ఒక అర్చామూర్తిని ఇచ్చి పాంచరాత్రాగమము ఉపదేశించాడట! ఇక్ష్వాకు వంశ రాజుకు ఆ మూర్తిని బ్రహ్మ దేవుడు అనుగ్రహించాడు. ఆ విధంగా ఇక్ష్వాకు కుల ధనమైన ఆ మూర్తిని శ్రీరామచంద్రుడు యుద్ధానంతరం విభీషణునికి ప్రసాదించాడు. ఆ కులధనమయిన శయన మూర్తి పెరుమాళ్ తాను ఇచ్ఛామాత్రంగా శ్రీరంగ ప్రదేశమందు కావేరీ ద్వీపమందు ప్రతిష్ఠితమయినాడు. ఆస్వామియే ప్రథమ అర్చామూర్తియై శ్రీరంగనాథ పెరుమాళ్లు గా ప్రసిద్ధమైనాడు.

మరల బ్రహ్మ దేవుడు భగవంతుని నుండి మరొక అర్చామూర్తిని పొందాడు. బ్రహ్మమానస పుత్రుడైన సంపత్ కుమారుడు తపస్సు చేయగా పరమాత్మ నుండి పొందిన "నిన్ఱకోలం" కాగల( నిలబడి ఉన్న) శ్రీశన్ అని పిలవబడు తిరునారాయణ మూర్తిని ఇస్తూ ఆమూర్తి నుండి పొందిన మరొక అర్చామూర్తి అయిన హృదయోద్భవ మూర్తిని తన వద్దే ఉంచుకున్నాడట. ఆ తిరునారాయణ మూర్తిని సంపత్కుమారులు మూల వరులు గా మేల్కోటై లో ప్రతిష్ఠించారు.

హృదయోద్భవ మూర్తి బ్రహ్మ నుండి నారదుల వారికి నారదుల నుండి శ్రీరామచంద్రులకు ఇవ్వబడి వేల సంవత్సరములు ఆరాధింపబడి యాదవ వంశీయుల వద్దకు చేరాడు. శ్రీకృష్ణ బలరాములచే ఆరాధింపబడి పరంపరగా తిరునారాయణ పురానికి చేరి కాల వైపరీత్యంతో నవాబుల వద్దకు చేరి శ్రీ భగవద్ రామానుజాచార్యులచేత తిరునారాయణ పురానికి చేర్చబడినారు. ఈ విధంగా కుల ధనానికి సంప్రదాయాల్లో విశిష్ట స్థానం ఉంది. గృహ తిరువారాధన మూర్తిని పరంపరగా కానీ భాగవతోత్తములు ఆచార్యుల చేత స్వీకరించి కాని ఏర్పాటు చేసుకోవాలనే సంప్రదాయం వచ్చింది . ★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

ఈ యజ్ఞవరాహమూర్తి అవతారగాథను ధ్రువుడు, నిత్యమూ శ్రీహరి గుణకీర్తన చేసే దేవముని నారదుణ్ని అడిగి తెలుసుకొన్నాడు. ఇదంతా మైత్రేయమహాముని విని విదురునికి చెబుతున్నాడు.

“దక్షప్రజాపతి కుమార్తె దితి అనే ఆమెకు సంతానం కావాలన్న కోరిక కలిగింది. భర్త ఐన కశ్యపప్రజాపతిని చేరి తన మనసులోని కోరిక విన్నవించుకున్నది. తన సవతు లందరూ సంతానం పొంది సంతోషంగా ఉన్నారు. ఆ భాగ్యం తనకూ కలగాలని ఆమె ఉద్దేశ్యం. ఆ మాటే భర్తతో చెప్పింది.



“ఒక ముహూర్తకాలం ఆగితే సంధ్యాకాలం పోతుంది. అటు పైన మంచి సమయంలో పుత్రులను ప్రసాదిస్తాను” అన్నాడు ప్రజాపతి. కానీ దితి తొందర పెట్టడంతో భగవంతునికి నమస్కరించి దితి కోరిక తీర్చాడు. “సంధ్యాసమయంలో రుద్రుడు తన అనుచరగణాలైన భూతాలతో సంచరి స్తుంటాడు. కనుక అది సంతానం పొందటానికి తగిన సమయం కాదు. అందుచేత రుద్రుని అనుచరులైన భద్రుడు, అనుభద్రుడు అనే వారు నీకు అపారశక్తిసామర్థ్యాలు, పరాక్రమం కలవారై ఇద్దరు పుత్రులుగా పుడతారు. సజ్జనులను పీడిస్తూ బలగర్వంతో భూమికి భార మవుతారు. మహాత్ములు వారి ఆగడాలను సహించలేక శ్రీహరికి విన్నవించుకుంటారు. ఆ పరమాత్మ ఆ దుష్కర్ములను సంహరిస్తాడు” అని దితికి చెప్పాడు.

ఆ సంగతి విన్న దితి చాలా ఆందోళన చెందింది. కశ్యపుడు ఆమెను ఓదార్చి, “నీ కుమారులలో రెండవవానికి ధార్మికుడైన కుమారుడు జన్మిస్తాడు. అతని వల్ల వంశపు కీర్తిప్రతిష్ఠలు జగత్తంతా వ్యాపిస్తాయి. తండ్రి దుర్మార్గుడైనా, అతడు హరిభక్తుడు కావడం చేత, అగ్నిలో పడిన బంగారం పరిశుద్ధ మైనట్లుగా వంశ పావనుడవుతాడు” అని అన్నాడు. తన పుత్రు లిద్దరూ హరి చేతిలో హతమవుతారన్న మాటలు తలచుకొని దితి దుఃఖించింది.

వంద సంవత్సరాల పాటు దితి గర్భం ధరించే ఉంది. ఇమె గర్భం నుండి వెలువడిన తేజస్సు, భూమిని, ఆకాశాన్నీ కప్పేసి సూర్యచంద్రులు కనపడకుండా పోయారు. భయకంపితులైన దేవతలందరూ బ్రహ్మను శరణు వేడారు.

అప్పుడు వారితో బ్రహ్మదేవుడు “ఓ దేవతలారా! నా మానసపుత్రులైన సనకస నందనాదులు వైకుంఠస్వామిని దర్శించే కోరికతో వైకుంఠానికి వెళ్లారు. అట్లా యోగశక్తితో వెళ్లిన వారికి ద్వారం వద్ద సమాన వయస్కులైన ఇద్దరు ద్వారపాలకులు కనిపించారు. శ్రీమహావిష్ణువును దర్శించా లనే కుతూహలంతో లోపలికి వెళ్లబోతున్న ఆ నలుగురు మహర్షులనూ ఆ ద్వారపాలకులు అడ్డుకొన్నారు. దానికి స్వామి, అమ్మ వారితో ఏకాంతంలో ఉండటమే కారణం. తమను అడ్డుకొన్నారని ఆగ్రహించిన సనకస నందనాదుల నేత్రాలు ఎర్ర బడ్డాయి. అక్క డున్న వారందరూ వింటుండగా వారు “ఈ విధంగా మీరు మమ్మల్ని నిరోధించడం మంచి పని కాదు. వైకుంఠనాయకుడైన ఆ సర్వేశ్వరునికీ, మాకూ భేదం లేదు. ఆవిషయం తెలిసి కూడా మందబుద్ధులై అనుచితమైన పని చేశారు. అందుచేత కామక్రోధలోభాలనే శత్రువులు బాధిస్తుంటే భూలోకంలో పుట్టండి!” అని వారిని శపించారు.

తమకు కలిగిన ఆ శాపం విని తల్లడిల్లిన ఆ ద్వారపాలకులు హరిభక్తులు కావటంతో, మునీశ్వరులకు నుదుట చేతులు జోడించి నమస్కరించారు. “మమ్మల్ని మీరే కటాక్షించాలి. లోభమోహాలున్న చోట మేము పుడితే, మా ప్రభువైన శ్రీహరి నామం మరచిపోకుండా అనుగ్రహించండి” అంటూ వేడు కొన్నారు.

సరిగ్గా అదే సమయానికి లోపలి నుండి ఈ కలకల మంతా ఆలకించిన సర్వేశుడు, ఇందిరాదేవితో సరస సల్లాపాలు చాలించి బయటికి వచ్చాడు. (మిగతా 15 వ పేజీలో)

# సామర్థ్యం నామ సార్థక్యం

(6వ పేజీ తరువాయి) పొందారు. పరమ భక్తులైన కాంచీపూర్ణుల (తిరు కచ్చి నంబి) ద్వారా శ్రీ కంచి వరదరాజ స్వామి ఇచ్చిన (వార్తా షట్కము) ఆరు ఆజ్ఞలను స్వీకరించారు. మూఢ విశ్వాసము గల భార్య ప్రవర్తనకు కలత చెందారు. సన్యాసం స్వీకరించి పెరియంబి వారిద్వారా "రామానుజ" నామాన్ని పొందారు. సన్యసించిన రామానుజాచార్యులను అర్చకముఖంగా ఛత్ర చామరాది గౌరవంగా ఆహ్వానించి శ్రీ కంచి దేవ పెరుమాళ్ "యతిరాజ" అను నామ ప్రదానం చేశారు.

యామునాచార్యుల ఆజ్ఞను అనుసరించి శ్రీ కంచి వరదరాజ స్వామి ముందు నమ్మాళ్వార్ల శ్రీ సూక్తులను గానం చేసి తన సంగీత ఆలాపనతో మెప్పించి శ్రీవరరంగార్యులు (తిరువరంగ పెరుమాళరయర్) రామానుజాచార్యులను శ్రీరంగానికి ఆహ్వానించారు. శిష్యులుగా స్వీకరించి ఉపదేశించి వారి మేధాశక్తికి ఆశ్చర్యం పొంది వారి జ్ఞాన తృష్ణకు సంతోషించి లక్ష్మణమునులని సంబోధించారు.

శ్రీ రామానుజాచార్యుల శ్రీరంగ ప్రవేశం ఆధ్యాత్మిక సంపన్నతకు నాంది అయింది. అనేక దివ్య దేశాల సముద్ధరణకు సిద్ధాంత వైభవానికి మూలమయింది. దివ్య ప్రబంధ ప్రకాశము, వ్యాస పరాశరుల నామ ప్రాశస్త్యము, శ్రీ భాష్య బ్రహ్మసూత్ర రచన అను యామునమునుల మూడు కోర్కెలను ఆజ్ఞలుగా స్వీకరించి జగదాచార్యులు పరిపూర్ణం చేశారు. ఆదిశేషాంశ సంభూతులైన కారణజన్ములైన రామానుజాచార్యులు శ్రీ రంగనాథ స్వామిని భక్తితో శరణాగతి చేశారు. అప్పుడే పెరియ పెరుమాళ్ ఉభయ విభూతుల (ఈ లోక పరలోక రక్షణ ) అధికారమును ఇచ్చి అర్చక ముఖమున "ఉడయవర్" అని సంబోధించారని కథా వైభవం! తిరుమంత్ర ఉపదేశమును స్వీకరించుటకు పరితపించిన రామానుజాచార్యులు పెద్దల ఆజ్ఞచే తిరుక్కోష్ఠియూరు గోష్ఠిపూర్ణుల వద్దకు వెళ్లారు. ఆచార్యుల అనుగ్రహానికై 18 సార్లు వెళ్లి తిరుమంత్ర ఉపదేశాన్ని స్వీకరించారు. మంత్ర రాజము యొక్క మహత్యాన్ని గ్రహించి ఆ ప్రయోజనాన్ని సకల జనులు పొందాలని సంకల్పించి మంత్రార్ధ మహత్తును అందరికీ వెల్లడించారు. అందుకు ముందుగా గోష్ఠిపూర్ణులు కోపించినా యతిరాజుల లోకోపకార బుద్ధికి ముగ్ధులై "ఎంబెరుమానారే" అని ఆలింగనం చేసుకున్నారట! ఎంబెరుమాన్ అంటే సాక్షాత్ రంగనాథస్వామి అని అర్థం. యజ్ఞమూర్తులను పండితులు మహానుభావులు సిద్ధాంత చర్చలో ముగ్ధులై శిష్యులుగా మారి యతి రాజుల పేరుగా అరుళాల పెరుమాళ్ ఎంబెరుమానార్ అని పేరు స్వీకరించారు. పంచాచార్యులలో మరొకరు తిరుమాలై యాండాన్. వీరు భగవద్విషయాన్ని రామానుజాచార్యులకు బోధించారు. నమ్మాళ్వార్ల శఠగోప గీతి సారాన్ని తెలుసుకుంటూ తాను బోధించని తమ ఆచార్యులైన యామునమునుల అంతరంగ మందలి అర్థ వివరణను శ్రీ రామానుజాచార్యులు చెప్పగా విని నమ్మాళ్వార్ పై వారికి గల భక్తి భావానికి చకితులైనారట! ఆనందంతో "శఠగోపన్ పొన్నడి" అని సంబోధించారు. అంటే నమ్మాళ్వార్ల బంగారుపాద స్వరూపము యతి రాజులు.

భూతపురిలో జన్మించిన జగదాచార్యులు అక్కడ కొలువైన ఆదికేశవ పెరుమాళ్ళ ఆజ్ఞతో భూతపురీశులుగా ప్రసిద్ధులైనారు. సదా తిరుప్పావై దివ్య ప్రబంధ అనుసంధానం చేస్తూ భక్తితో పరవశించిన యతిరాజులను చూసి ఆనందంతో వారి ఆచార్యులైన మహా పూర్ణులు తిరుప్పావై జీయర్ అని సంబోధించారట!

నాచ్చియార్ తిరుమొళి లోని గోదాదేవి ప్రార్థన మొక్కును అనుసరించి 100 వెన్న భాండాలను చక్కెర పొంగలి ఘటాలను "తిరుమారిలుంషోలై" స్వామికి సమర్పించి గోదాగ్రజులు గా"కోయిల్అణ్ణన్"గా గోదాదేవి అనుగ్రహంతో అర్చకముఖంగా సంబోధింపబడ్డారు.


కాశ్మీరం లోని శారదా పీఠంలో ఉన్న బోధాయన గ్రంథాన్ని సంపాదించుటకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తిరిగి శ్రీభాష్య రచనానంతరం కాశ్మీరం చేరుకున్న రామానుజాచార్యులను శారదాదేవి ఆదరించి వారు రచించిన శ్రీ భాష్యమును కరకమలముల ధరించి శ్రీ భాష్యకారర్ అని దీవించిందట!

తిరుమల చరిత్రలో యతి రాజుల కృషి విశేషమైనది. వారు తిరుమల నంబి వద్ద రామాయణ రహస్యములను అధ్యయనం చేశారు. శ్రీనివాస పెరుమాళ్లను నారాయణ స్వరూపముగా శంఖ చక్ర ధారణము చేయించారు. లక్ష్మీదేవిని వక్షస్థల మందు స్థాపించారు ఆరాధనా విశేషాలను ఏర్పాటు చేశారు. తిరుమల దేవాలయంలో భాష్యకారుల సన్నిధిగా రామానుజాచార్యుల సన్నిధి కొంచెం ఎత్తయిన ప్రదేశంలో ఉంటుంది. లక్ష్మీదేవిని ఏర్పాటు చేసి మామగారి స్థానంగా, శంఖచక్రములను సమర్పించి ఆచార్య స్థానముగా దేశికేంద్రులుగా కీర్తించబడ్డారు.

వారి కృషిని సత్కృతిని ప్రతిబింబించేలా ఎందరో శిష్యులు అనేక నామాలతో కీర్తించారు రామానుజ అను నాలుగు అక్షరములు గల నామమే లేకుంటే మన వంటి వారు సత్యాన్ని తెలిసి కొనలేక అజ్ఞానంలో ఉండేవారని పెద్దలు భావిస్తారు. గురుపరంపరా హారంలో శ్రీరామానుజాచార్యులే నాయక మణి అని పెద్దల అభిప్రాయము. శ్రీరామానుజ నామస్మరణము మోక్షదాయకము కనుకనే పెద్దలు పరస్పర పలకరింపులో రామానుజ దాసన్ అని పలికే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి)

### స్థానబలం

దానికి ముఖ్యాంశాలు ఒకటి స్థలం. రెండవది ముహూర్తము. మూడవది దైవబలము. అందుకోసం ప్రారంభిద్దాం అని ముందుగా ముహూర్తం చూశారు విద్యారణ్య స్వామి వారు. ఆ తర్వాత ముహూర్తం దొరికింది. తర్వాత ఏడు సంవత్సరాల కాలం తాను తపస్సు చేస్తూ తనకు అనుచరులుగా బ్రాహ్మణ పిల్లలను పెట్టుకొని ఆ అడవి అంతా తిరుగుతూ ఉన్నారు. అడవిలో తపస్సు చేసుకుంటున్న ఆయన "పిల్లలారా మీరు ఈ అడవిలో ఎక్కడ అయితే ఉన్నారో అక్కడ రోజు కొంత ప్రాంతాన్ని తిరుగుతూ రండి. మీరు తిరుగుతూవుండే సమయంలో ఏ విశేషాలు కనిపిస్తాయో నాకు ఆ విశేషాలు చెప్పండి ఇలాగ కొంతకాలం గడిచింది. ఒకనాడు గురువు గారికి ఒక విచిత్రమైన విషయాన్ని చూశామని చెప్పారు. ఇక్కడికి దగ్గరలోనే ఒక కుందేలు పొద వుంది, అక్కడ చిన్న చిన్న పిల్లలు ఉన్నాయి. ఆడ కుందేలు, మగ కుందేలు కలిసి కాపలా కాస్తున్నాయి. ఇంతలో ఒక చిరుత పులి ఆ కుందేలు పిల్లల్ని తీసుకెళదామని రాగా ఆడ కుందేలు మగ కుందేలు కలిసి ఆ చిరుత పులిని తరిమి కొట్టాయి అని చెప్పారు. ఎక్కడ నాయనా ఆ స్థలం అని అడగగా, వారు చూపించారు. నిర్మాణ స్థలాన్ని ఏర్పాటు చేసారు విద్యారణ్య స్వామి. దానికి కారణం ఏంటి? శంకర భగవత్పాదాచార్య స్వామి వారు ఆశ్రమ నిర్మాణం చేయాలంటే కరుణరస ప్రధానమైన స్థలం కావాలి ఆశ్రమానికి. మరిక్కడ రాజ్యం, కోట నిర్మాణం చేయాలి కనుక పౌరుష ప్రదమైనటువంటి స్థలం కావాలి అని ఇక్కడ ఈ స్వామి వారు నిర్ణయించారు. ఆ తర్వాత కోట నిర్మాణం జరిగింది. తారాబలం చంద్రబలం తదేవ విద్యా బలం దైవ బలం తదేవ" అని మనకు పెద్దలు చెబుతారు. ముహూర్త నిర్ణయం జరిగింది. ఏ సమయంలో మేము ముగ్గు వెయ్యాలి అని ప్రశ్నించగా ముహూర్త నిర్ణయం ఇదమిద్ధంగా చెప్పలేను. ఆ ముహూర్తం సమీపించగానే నేను ఒక అద్భుతమైన శంఖారావం చేస్తాను. ఆ శంఖధ్వని ఎంతసేపు వస్తుందో అంత సేపు ముగ్గు పోయండి అని చెప్పారు. తదేవ లగ్నం చేయాలనే కోరిక, సుదినం తదేవ మంచి రోజు, తారాబలం చంద్రబలం విద్యా బలం దైవ బలం అని కూడా చెప్పారు. ఆ ముహూర్తం కాలంలోనే శంఖారావం చేశాడు. శంఖ ధ్వని ఎంతసేపు వచ్చిందో అంత సేపు ముగ్గు పోశారు. కానీ తారుమారు జరిగింది! స్వామి ఊదే శంఖారావం కంటే ముందుగా ఆ ఉదయాత్ పూర్వమే ఎవరో ఒక బాలసంతు బిక్షాటన చేసుకొంటూ శంఖం ఊదాడు. అది స్వామివారి పూరించిన శంఖం అనుకొని దానికి కొంత ముగ్గు పోశారు, స్వామివారు శంఖధ్వని చేసినదానికి కొంత ముగ్గు పోశారు. అనగా స్వామివారి శంఖధ్వని చేసినదానికి బిచ్చగాడు శంఖధ్వని చేసినదానికి రెండింటికి ముగ్గు పోశారు. ఆ తరువాత స్వామి వారు ఏ శంఖ ధ్వనికి ముగ్గు పోశారు? అని అడుగగా, రెండింటికి పోశాము అని చెప్పారు. అంటే నాయనా ముహూర్తం తారుమారు అయిపోయింది, దైవ బలం చాలా గొప్పది కనుక భారతీయ సంస్కృతీ సంప్రదాయంలో ప్రధానంగా దైవాన్ని ముందు పెట్టుకొని చేస్తారు. కనుక నా ముహూర్తము గాని, నీ సంకల్పము గాని సమస్తము కూడా మంచివె. కానీ నీవు అనుకున్న కాలం బంగారు పళ్ళెంలో, బంగారు గ్లాసులలో ఆహారం, నీరు వెయ్యి సంవత్సరాలు తీసుకోవాలని కోరుకున్నావు. శంఖ ధ్వని తారుమారైనందున తొమ్మిది వందల సంవత్సరాలు ఎగిరిపోయాయి. వంద సంవత్సరాల వరకు మాత్రమే నువ్వు అనుకున్నట్టుగా సువర్ణయుగం సాగుతుంది అని చెప్పారు.. అదే ప్రకారం మనకు చరిత్రలో చదువుకున్నాం. ప్రతాపరుద్ర గజపతి నుంచి శ్రీకృష్ణదేవరాయల కాలం వరకు అద్భుత సువర్ణయుగంగా చరిత్ర పేర్కొంది. (మిగతా వచ్చే సంచికలో...)

# ఆచార్యుల ఔదార్యము



**శ్రీమతి కె.వి. జానకమ్మ**

మనం ఉన్నది మూడు గుణాలతో కూడిన ప్రకృతిలో! ఈ మూడు (సత్వరజస్తమో గుణములు) గుణాలు మనను విడవకుండా ఉంటాయి. ఒక్కొక్కసారి ఒక్కొక్క గుణం అధికంగా ఉండవచ్చు గాక! గుణ త్రయాత్మక విశిష్టులమై మనమున్నాము. అది మనకు ఉండే నిత్య లక్షణం. ఆ విధంగానే మూడు ఋణాలు కూడా మనకు ఉన్నాయి. అవి దేవ ఋణం, ఋషి ఋణం, పితృ ఋణం అని చెప్తారు. ఈ మూడు ఋణాలను మనం తీర్చుకోవాలి. అందులో ఒకటి ఋషి ఋణం. క్రాంత దర్శనులైన ఋషులు వారికుండే జ్ఞానంతో భూత భవిష్యత్ వర్తమానాలను దర్శించి అద్భుతమైన వాఙ్మయాన్ని మనకందించి ఉన్నారు. అలా అందించడంలో నిస్వార్థతే తప్ప ఏ రకమైన ప్రయోజనము వారికి లేదు. ఋషి ఋణం మనం తీర్చుకునే పద్ధతి వారందించిన గ్రంథాలను అధ్యయనం చేయడమే!

అటువంటి మహామునులు అయిన భగవద్రామానుజులు అందించిన గ్రంథాలను మనం అధ్యయనం చేయడమే ఆ ఋణాన్ని మనం తీర్చుకోవడం. ఆ సదవకాశం మనకు లభించింది. అలా అద్భుత వాఙ్మయాన్ని అందించిన మహానుభావులు మహా ఉదారులుగా చెప్పబడతారు. ఆండాళ్ తల్లి "వళ్ళల్ పెరుం పశుక్కల్" అంటుంది. ఆచార్యులు గొప్ప ఔదార్యం కలవారు అని. ఏ కోరిక లేకుండా తమ ఔదార్యాన్ని ప్రదర్శించిన వారిలో మొట్టమొదట మనం తెలియ చేయవలసిన వారు భగవద్రామానుజులే! "ఔదార్య మేరువు, కరుణాసింధువు" అని అంటారు. కరుణ ఉంది కనుకనే మంత్ర అర్థాన్ని గోపురం ఎక్కి లోకానికంతటికి వెదజల్లగలిగారు భగవద్రామానుజులు. లోకానికి కలిగే అనర్థాన్ని తొలగించడం కోసం పంచి పెట్టగలిగారు. మంత్రాలను వెదజల్లడమే ఔదార్యం అని కాకుండా గ్రంథాలను లోకానికి అందించి శాశ్వతమైన ఉపకారం చేసిన మహానుభావులు. లోకోపయోగమైన పని చేయాలంటే కరుణ ఉండాలి. ఔదార్యం ఉండాలి. ఆ ఔదార్యానికి మారుపేరు భగవద్రామానుజులు.

మహానుభావులైన మునులు ఋషులు ఆళ్వార్లు అందరూ ఆ కోవకు చెందిన వారే అందరికీ ప్రతీకగా భగవద్రామానుజులను తీసుకోవాలి. అడిగితే అందించేది మేఘమైతే అడగకుండానే అందించేవారు ఆచార్యులు "చాతకః త్రి చతురాన్ పయః కణాన్ యాచతే జలధరం పిపాసయా సోపి పూరయతి విశ్వమంభసా" అంటారు. చాతక పక్షి మేఘం కనపడగానే తనకు కావలసిన మూడు నాలుగు నీటి బిందువులతో దాహం తీర్చమని యాచిస్తుంది. ఆ జలధరం ఆ రెండు మూడు నీటి బొట్లు కురిపించి ఆపకుండా లోకాన్ని అంతటినీ నీటితో నింపుతుండట ! అంతటి ఉదారత జలధరానిది. ఇటువంటిదే మహానుభావుల ఉదారత కూడా! ఎవరో ఒకరు వెళ్లి వారిని ఆశ్రయించగానే యాచించగానే కేవలం వారి కోసమే కాక, వారికి సరిపడినంత మాత్రమే కాక లోకమంతా ఉజ్జీవించేట్లుగా పూర్ణత కలిగేటట్లుగా తమ సంపదను లోకానికి వెదజల్లగలుగుతారు "హంత! హంత! మహతాం ఉదారతా" అంటారు అంటే వారి ఉదారతను మనము ఊహించలేము.అటువంటి మహానుభావులు భగవద్రామానుజులు.

ఇరామానుష నూత్తన్దాదిలో "కారేయ్ కరుణై యిరామానుశ ! ఇక్కడలిడత్తిళ్ ఆరే యఱిపవర్ నిన్నరుళిన్ తన్మై" మేఘంతో పోలిన కరుణ కలిగిన భగవద్రామానుజా! అని భగవద్రామానుజులను సంబోధించారు. ఇది మేఘంతో ఆచార్యులకు ఉండే ఒక సామ్యము.

సామాన్యమైన భగవత్ సృష్టిలో ఉండే జలధరం ముత్యాల వంటి నీటిని వర్షిస్తుంది. నిజమైన ముత్యాలను వర్షించే మేఘము ఆచార్యులు. "మాముత్త నిదిశొరియువమ్ మాముకిల్కాళ్" అంటారు. మంచి ముత్యాలను నిధి రూపంగా వర్షించేవారు ఆచార్యులు. ఇది ఆచార్యులకు మేఘమునకు ఉండే సామ్యము అటువంటి జగదాచార్యులైన భగవద్రామానుజులు మన అదృష్టం చేత ఈ లోకానికి అందారు.


భగవంతునికి లోకానికి కూడా భగవద్రామానుజులు సంపద అని అంటారు. చేతనులు తన దరికి చేరలేక పోతున్నారు అని స్వామికి గల చింతను తీర్చే సంపద అయితే మనకు సంసారచింతను తీర్చే సంపద భగవద్రామానుజులు. వారు నవరత్నముల వంటి 9 గ్రంథాలను మనకందించారు. ఆ తొమ్మిది గ్రంథాలకు ఒక క్రమం ఉంది విషయ ప్రతిపాదన చేసిన రీతిని బట్టి పెద్దలు నిర్ణయం చేశారు. ఆచార్యులను ఘటకులు అంటారు అనగా రెండింటిని కలిపేవారు. శ్రుతి వాక్యములలో ఘటకములు, భేద శ్రుతులు, అభేద శ్రుతులు అని మూడు రకాలు ఉన్నాయి. భేద అభేద శృతులను ఘటక శ్రుతులతో సమన్వయ పరచినారు. అటువంటి సామర్థ్యం భగవద్రామానుజులదే ! అనితర సాధ్యము.


# పుస్తక పరిచయం

## మోక్ష ధర్మములు - శాంతి పర్వము

కడలిలో కల్మషాలు తొలగాలంటే ఉవ్వెత్తున ఉధృతంగా అలలు ఎగసిపడాలి! అలుముకున్న దుస్సాంప్రదాయపు చీకట్లు తొలగాలంటే సత్ జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలు ఎన్నో రావాలి! ఆధ్యాత్మిక సాంప్రదాయ సాహిత్యం విస్తృతంగా రావాలి!సాంప్రదాయ సేవలో గ్రంథ పరిచయం కూడా ఒక భాగంగా భావించి సాంప్రదాయ గ్రంథాల, కొత్త పుస్తకాల పరిచయాన్ని పాఠకుల ముందు ఉంచాలని శ్రీసన్నిధానం సంకల్పించింది.

నేటి పుస్తక పరిచయం మోక్షధర్మములు - శాంతిపర్వము కృతికర్త శ్రీమాన్ శ్రీ కండ్లకుంట వెంకట నరసింహాచార్యులు వీరు 30కి పైగా సాంప్రదాయ గ్రంథములను రచించారు. ఉభయ వేదాంత ప్రవచనకారులు. ఎన్నో పురస్కారాలను పొందారు. గ్రంథ విశేషాలు: మహాభారతం శాంతి పర్వం లోని 174వ అధ్యాయము నుండి 365 అధ్యాయముల వరకు గల వేదాంత తత్వాన్ని, మోక్ష ధర్మములను సులభమైన శైలిలో, మధురమైన తెలుగులో అందరికి అర్థమయ్యే రీతిలో రచించారు. కథాంశములతో పాటు ధర్మ రాజు భీష్మాదుల సంభాషణ రూపంగా ప్రశ్నోత్తర విధానంతో వివరించారు. ఎన్నో తాత్విక విశేషాలను నిత్య జీవనానికి అనువర్తింప చేసే విధంగా రచించారు. మరియు ఈ గ్రంథం ఆకర్షణీయమైన సచిత్ర సౌందర్యంతో 480 పేజీలతో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు పండితుల ముందుమాటలతో అద్భుతంగా రూపుదిద్దుకున్నది. ప్రయోజనవంతంగా పాఠకులకు అందుబాటులో ఉన్నది. ఈ గ్రంథరాజము. లభించు ఫోన్ నెంబర్ 9989392623






## భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(11వ పేజీ తరువాయి) అందరూ జయ జయధ్వానాలు చేస్తూ ఉండగా, శ్రీమహాలక్ష్మీదేవితో సహా అందరికీ దివ్యదర్శన మిచ్చాడు. సనకాదులు తనివి తీరగా భగవానుణ్ని స్తుతించారు. "ఓ స్వామీ! నేడు నీ పాదాశ్రితులపై అలిగి శపించాము. దాన్ని నేరంగా చూడక మమ్మల్ని దయ చూడు!" అన్నారు.

అప్పుడు స్వామి "ఈ ఇద్దరూ జయుడు, విజయుడు అనే పేర్లున్న నా ద్వారపాలకులు. మిమ్మల్ని లెక్క చేయక నా ఆజ్ఞను అతిక్రమించి వారు చేసిన అపరాధానికి తగిన దండన విధించారు. మీరు చేసిన ఈ పని సరైనదే. అదీ కాక భృత్యులు–సేవకులు - చేసే అపరాధం స్వామిదే అవుతుంది. కనుక వారు చేసిన ఈ తప్పునకు నా పట్ల ఉన్న గౌరవంతో నన్ను మన్నించి ప్రసన్నులు కండి" అన్నాడు. (సశేషం)

## శ్రీపతి స్తుతి సుభాషితం

(9 వ పేజీ తరువాయి) స్త్రీలు మాత్రం ఆభరణాలన్ని ప్రత్యేకమైన సందర్భాలలో అంటే పండుగలు, శుభకార్యాలు, పూజలు వగైరా రోజుల్లో మాత్రమే పెట్టుకుంటున్నారు. అనేకమైన అనారోగ్యాలతో సతమత మవుతున్నారు. దీనిని వేదాంతులు 'కలి ప్రభావం' అంటారు. *మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో.*





శ్రీసన్నిధానం పత్రిక రిజిస్ట్రేషన్ కొరకు 9502583323 సంప్రదించండి లేదా srisannidhanam.org లో subscribe చేయండి.

SBI Payments
MERCHANT NAME: SRI SANNIDHANAM CHARITABLE TR
UPI ID: 9502583323@SBI
SCAN & PAY
SBI Pay
BHIM UPI

మీ అభిప్రాయాలు మాతో పంచుకోండి, శ్రీసన్నిధానం ట్రస్ట్ లో భాగస్వామ్యం కండి

సువర్ణావకాశం

వెబ్ సైట్ లో ప్రకటన కొరకు వెంటనే సంప్రదించండి.

7.5 X5 సెంటీ మీటరు రూ. 350 /- చొప్పున ఫుల్ పేజీ వరకు ప్రకటన ఇవ్వవచ్చు. చివరి పేజీ 7.5 X 5 సెంటీ మీటరు రూ. 650/- చొప్పున పత్రిక లో ఫుల్ కలర్ ప్రింట్ ప్రకటన ఇచ్చిన వెబ్ సైట్ లో 60 రోజులు ప్రకటన వేయబడును. ఒక సంచికలో ప్రకటన అడ్వటైజ్మెంట్ ప్రచురించడంతో పాటు మీకు నచ్చిన వారికి 5 పత్రికలు పంపబడును

9502583323
PhonePe

# ఆధ్యాత్మిక వార్తలు







శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్) నిర్వహించిన శ్రీవైష్ణవ ఆత్మీయ సమ్మేళనము 18-06-2023 నాడు చక్రంగుడి, నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ.ఉ.వే. శ్రీమాన్ చిలకమట్టి శ్రీవర్ధనాచార్యులు గారికి సత్కారము, సన్మానము మరియు శ్రీ సంప్రదాయ పెద్దలకు సత్కారములు. శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయరు స్వామి వారి ప్రత్యక్షపర్యవేక్షణలో ఎంతో విజయవంతంగా జరిగాయి.







యోగా దినోత్సవం సందర్భంగా పలుచోట్ల యోగాసన ప్రదర్శనలు నిర్వహించిన దృశ్యాలు.





శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక
(చారిటబుల్ ట్రస్ట్ Regd No 118/2022)

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారి మంగళాశాసనములతో

## సారస్వత ఆరాధనోత్సవమ్

## ఆహ్వాన పత్రిక

భాగవత సేవయే! సంప్రదాయ సేవ !!

భారతీయ సంస్కృతీ సంప్రదాయ సేవా నిరతులందరికీ సాదర స్వాగతం!

ఆధునిక సమాజానికి ఆధ్యాత్మిక శ్రీసూక్తినిధిని అందించాలని, సంప్రదాయ సేవాలక్ష్యంతో శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఆవిర్భవించింది. భాగవత సేవయే! సంప్రదాయ సేవ!! పండితులను, కళాకారులను, సాహితీ వేత్తలను, సంప్రదాయ సేవకులను, విద్యార్థులను సమ్మానించుకునే వేదికగా...

స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆషాఢ బహుళ తదియ
తేది 06 జులై 2023 గురువారం మధ్యాహ్నము 3 గంటల నుండి సభా నిర్వహణ.

సభాధ్యక్షులు : శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు, పత్రిక వ్యవస్థాపకులు.

విశిష్ట అతిథులు

శ్రీ ఉ.వే. శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
(గౌరవ సంపాదకులు)

శ్రీ ఉ.వే. శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహాచార్యులు
(గౌరవ సంపాదకులు)

శ్రీ ఉ.వే. శ్రీమాన్ కండ్లకుంట వెంకటనర్సింహాచార్యులు
(సంప్రదాయ గ్రంథకర్తలు)

శ్రీ ఉ.వే. శ్రీమాన్ శిరిశినహళ్ వెంకటాచార్యులు
(గోపాలోపాయన పురస్కార గ్రహీత)

వేదిక:
వేదభవనం, కరీంనగర్.
కార్యక్రమవివరాలు:
పత్రికా పరిచయం, ప్రవచనాలు, సందేశాలు, పుస్తకావిష్కరణ, పురస్కారాలు

ఇట్లు
ఉత్సవ ఆహ్వాన కమిటి
శ్రీసన్నిధానం చారిటబుల్ ట్రస్ట్ / శ్రీసన్నిధానం పత్రిక